స్టాళ్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

ఘనంగా అగ్రికల్చరల్ ఎడ్యుకేషన్ దినోత్సవం

కాశీబుగ్గ, డిసెంబర్ 2: పైడిపల్లిలోని వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చరల్ ఎడ్యుకేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు వివిధ రకాల స్టాళ్లను ప్రదర్శించారు. అలాగే, వర్మికంపోస్టు యూనిట్, వ్యవసాయ క్షేత్రాలు, వాతావరణ ప్రయోగశాలను పరిశీలించారు. నాలుగు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు సందర్శించారు. అనంతరం వారికి క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.బలరాం, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి పాల్గొన్నారు.

ఈతకల్లు తాగుతున్న కోతి

ఆహా ఏమి రుచి..

మండలంలోని ముగ్దుంపురం శివారు నర్సంపేట-నెక్కొండ ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈతవనంలో శనివారం ఓ కోతి కల్లు తాగుతూ కనిపించింది. కోతి ఈతచెట్టు ఎక్కి బింకిపై ఎంచక్కా కూర్చొని దర్జాగా కల్లు తాగింది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. కొందరు యువకులు ఈ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

- నర్సంపేట రూరల్, డిసెంబర్ 2

షూటింగ్‌ను ప్రారంభించిన మార్నేని రవీందర్‌రావు

ఐనవోలులో షార్ట్‌ఫిల్మ్ షూటింగ్

ఐనవోలు, డిసెంబర్ 2: ఐనవోలు మండల కేంద్రంలో 'బాబుగాడంటే' షార్ట్ ఫిల్మ్ షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పాల్గొని క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఐనవోలు మల్లికార్జునస్వామి ఆశీస్సులతో ఈ షార్ట్‌ఫిల్మ్ విజయం సాధిస్తుందని మార్నేని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాధాకృష్ణ, నిర్మాత, హీరో మహేంద్ర సత్య చేదెళ్ల, హీరోయిన్ లాస్య, అసోసియేట్ డైరెక్టర్లు శివ, కార్తీక్, కెమెరామెన్ అరుణ్, నటీనటులు కేతిరి సుధాకర్‌రెడ్డి (బలగం కొమురయ్య) శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ అలీ, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ మునిగాల సంపత్‌కుమార్, సర్పంచ్ కుమారస్వామి, ఉప సర్పంచ్ సతీశ్, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు వెంకన్న, పరమేశ్, రాజు, అనిల్, యాదగిరి పాల్గొన్నారు.

చాగంటి రామ్‌చరణ్, వినయ్‌కుమార్, దాడి వినయ్‌సాయిరామ్

రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు ఉప్పరపల్లి విద్యార్థులు

వర్ధన్నపేట, డిసెంబర్ 2: ఈ నెల 6, 7వ తేదీల్లో హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం వేణు, పీఈటీ వీరస్వామి శనివారం తెలిపారు. గత నెల 27న హనుమకొండ జేఎన్ఎస్‌లో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14 ఎస్జీఎఫ్ఐ జిమ్నాస్టిక్ స్కూల్ గేమ్స్‌లో పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న దాడి వినయ్‌సాయిరామ్, చాగంటి రామ్‌చరణ్, చాగంటి వినయ్‌కుమార్ పాల్గొని ప్రతిభ చూపారు. వీరిని టీచర్లు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులను సిద్ధం చేయాలి

గిర్మాజీపేట, డిసెంబర్ 2: ఈ నెల రెండో వారంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్‌స్పైర్ ప్రదర్శనకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులను హెచ్ఎంలు సిద్ధం చేయాలని డీఈవో డీ వాసంతి సూచించారు. జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్‌స్పైర్ ప్రదర్శనను ఎక్కడ నిర్వహించనున్నది త్వరలోనే తెలియజేస్తామని, వివరాలకు జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ 9848878455 నంబర్‌లో సంప్రదించాలని డీఈవో కోరారు.

కోటలో కుక్కల స్వైర విహారం

ఖిలావరంగల్, డిసెంబర్ 2: ఖిలావరంగల్‌లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. శనివారం ఉదయం నలుగురు వ్యక్తులు కుక్కకాటుకు గురికావడంతో స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించారు. నిత్యం కుక్కల స్వైరవిహారంతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, కుక్కలు విద్యార్థుల వెంట పడుతుండడంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. పర్యాటక ప్రాంతమైన కోటలో కుక్కలను కట్టడి చేయాలని స్థానికులు వరంగల్ మహా నగరపాలక సంస్థ అధికారులను కోరుతున్నారు.

'ప్రజలు నిబంధనలు పాటించాలి'

పోచమ్మమైదాన్, డిసెంబర్ 2: వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు వరంగల్ ప్రాంతంలో ఆదివారం 144 సెక్షన్ అమల్లో ఉంటుందని మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు, ఇంతెజార్‌గంజ్ సీఐ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కౌంటింగ్ నేపథ్యంలో నగరంలో ఎలాంటి ర్యాలీలు, డీజేలు, పటాకులు కాల్చడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేదని, నలుగురు కంటే ఎక్కువ మంది గుమికూడొద్దని సూచించారు. 24 గంటల తర్వాత పోలీసుల అనుమతి తీసుకుని సంబురాలు చేసుకోవచ్చని సూచించారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

నర్సంపేట, డిసెంబర్ 2: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. ఆలయంలో 17వ రోజు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అన్నదాతలు స్వామి వారికి తేనె అష్టాభిషేకం, ధనాభిషేకం పూజలు చేశారు. కార్యక్రమంలో దాతలు మాలె సుజాత-కనకయ్య, ఉమాశంకర్ ఇండస్ట్రీస్, లక్ష్మి మోడ్రన్ రైస్‌మిల్లు యజమానులు కృష్ణమూర్తి గుప్తా, దొండేటి శ్రీనివాసరావు-సుజాత, గణేశ్-మానిక, నల్ల సుధాకర్‌రెడ్డి-భారతి, సంతోష్-హరిణి, రాజేశ్, సురేశ్, మాదారపు చంద్రశేకర్, శ్రీరాం ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న భక్తులు

10న పడిపూజ, అన్నదానం

కరీమాబాద్, డిసెంబర్ 2: ఈ నెల 10న నాగమయ్య కుటీరం, శ్రీఅయ్యప్ప సేవా సమితి, అయ్యప్ప పరపతి సంఘం, హరిహరపుత్ర పరపతి సంఘం ఆధ్వర్యంలో ఉర్సులోని నాగేంద్రస్వామి ఆలయ సమీపంలోని కుటీరం వద్ద అయ్యప్పస్వామి పడిపూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఉర్సు బొడ్రాయి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం పోస్టర్ ఆవిష్కరించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అయ్యప్ప స్వాములు

రాష్ట్రస్థాయి పోటీలకు సర్కారు పాఠశాల విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

కరీమాబాద్, డిసెంబర్ 2: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు రంగశాయిపేటలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో ఎంపికైన మద్దెల అక్షయ(కబడ్డీ), పనికల భవాని(ఖోఖో)ని అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ గోగు నారాయణ, టీచర్లు పాల్గొన్నారు.

ఇల్లందలో క్షుద్ర పూజల కలకలం

వర్ధన్నపేట, డిసెంబర్ 2: ఇల్లంద శివారులో క్షుద్రపూజలు కలకలం రేపాయి. గ్రామానికి చెందిన పలువురు శనివారం ఉదయం వాకింగ్‌కు వెళ్లగా, గుట్ట సమీపంలో పసుపు, కుంకుమ, తెల్లపిండితో రంగులు వేసి ఉండడం తోపాటు క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించాయి. ఆందోళనకు గురైన వాకర్లు వెంటనే గ్రామ ప్రముఖులకు తెలియజేశారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలాగే, శుక్రవారం మండలకేంద్రంలోని ఫిరంగిగడ్డలో ధాన్యం కుప్ప వద్ద గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసినట్లు రైతులు తెలిపారు. క్షుద్రపూజలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాసవీమాత ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 2: కార్తీకమాసం సందర్భంగా ములుగురోడ్డులోని వాసవీమాత ఆలయంలో శనివారం భక్తులు శ్రీరమా సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్నారు. ప్రతి రోజూ జరుగుతున్న సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొనే భక్తులు 9246894318 నంబర్‌లో సంప్రదించాలని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అంచూరి శ్రీనివాస్ తెలిపారు.

బీరు సీసాలను జాతీయ రహదారిపై పగులగొడుతున్న యజమాని

అర్ధరాత్రి మద్యం షాపు యజమాని వీరంగం

- జనావాసాల మధ్య దుకాణం వద్దన్నందుకు..
- రహదారిపై బాటిళ్లు పగలగొట్టిన వైనం

ములుగు, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు ముందు అర్ధరాత్రి సంబంధిత యజమాని నరేందర్‌రెడ్డి వీరంగం సృష్టించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని ఆటో నగర్‌లో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పాత రైస్ మిల్లు వద్ద నూతన మద్యం షాపును ఏర్పాటు చేస్తున్నారు. కాలనీ వాసులు ఈ ప్రాంతంలో దుకాణం పెట్టొద్దని కొన్ని రోజులుగా చెబుతున్నారు. కాగా, శుక్రవారం అర్ధరాత్రి షాపునకు చేరుకున్న మద్యాన్ని అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో కాలనీవాసులు అడ్డు చెప్పారు. తమకు ఇబ్బందులు కలుగుతాయని మండిపడ్డారు. దీంతో షాపు యజమాని కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేసేందుకు డీసీఎంలో ఉన్న బీర్ల సీసాలను జాతీయ రహదారిపై పగులగొట్టి వీరంగం సృష్టించాడు. శనివారం కాలనీవాసులు మాట్లాడుతూ షాపు ఏర్పాటు చేయడం వల్ల మందు బాబులు తమ ఇండ్ల వైపుగా వచ్చి ఇబ్బంది పెడతారని చెప్పినందుకు షాపు యజమాని రౌడీలాగా ప్రవర్తించాడన్నారు. షాపు ప్రారంభించిన తర్వాత సీసాలను తమ ఇండ్ల మీద విసిరే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజుల క్రితం ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశామని, వారు పట్టించుకుంటే ఇలా జరిగేది కాదన్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐని వివరణ కోరగా... కాలనీవాసుల ఫిర్యాదు మేరకు షాపు అక్కడ ఏర్పాటు చేయొద్దని చెబితే యజమాని వినడం లేదన్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

చిల్పూరు, డిసెంబర్ 2 : మండలంలోని లింగంపల్లికి చెందిన మోతె సాయికిరణ్ (20) శనివారం గ్రామంలోని జంపన్నవాగు ఒడ్డున చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ విఫలమై ఆత్మహత్యకు పాల్పడినట్లుగా మృతుడి తల్లి మోతె స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై బొల్లం వినయ్ కుమార్ తెలిపారు.